క్లుప్తంగా

పాఠశాలలో బాల వైజ్ఞానిక ప్రదర్శన



ఇందల్వాయి: ఇందల్వాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 53వ జాతీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వాయు కాలుష్యం, హరిత శక్తి, ఆరోగ్యం, పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, సుస్థిర వ్యవసాయం వంటి అంశాలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ వృక్షశాస్త్రం ఆచార్యులు అహ్మద్ అబ్దుల్ హలీం ఖాన్, ప్రిన్సిపాల్ రమేశ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉపన్యాస పోటీలు



నిజామాబాద్ నాగారం: అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని రోటరీ క్లబ్ ఆఫ్ జేమ్స్ ఆధ్వర్యంలో సెయింట్ జేవియర్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు.విజేతలకు క్లబ్ ప్రెసిడెంట్ పాకాల నరసింహారావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రెటరీ గంజి రమేశ్, పాస్ట్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాశ్, పాస్ట్ సెక్రెటరీ బంగారు వీరబ్రహ్మం, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ గ్రహీతకు సన్మానం



సిరికొండ: ఓయూలో పీహెచ్‌డీ సాధించిన అటవీ శాఖ బీట్ అధికారి మాలోతు రాజేందర్‌ను ఆలిండియా బంజారా సేవా సంఘం మండల నాయకులు శుక్రవారం సన్మానించారు. మారుమూల ప్రాంతంలో ఉద్యోగం చేస్తూ పీహెచ్‌డీ పట్టా పొందడం అభినందనీయమని వారు కొనియాడారు.మండల కేంద్రంలోని అటవీ రేంజ్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రూప్‌సింగ్, వర్జన్ తండా కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మోజీరాం,శివరాం,బంజారా యూత్ రాష్ట్ర అధ్యక్షుడు రవి, ఇన్‌చార్జి రేంజర్ రవీందర్, డీఆర్‌వో గంగారాం, సెక్షన్ అధికారులు సాయికిరణ్, కృష్ణగీత్ తదితరులు పాల్గొన్నారు.

బలవీర్ బాలకృష్ణకు..



నిజామాబాద్ రూరల్: దాశరథి శతజయంతి కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాందేవ్‌వాడలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో చిత్రకళ రంగంలో ప్రతిభ కనబరుస్తున్న బలవీర్ బాలకృష్ణను సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కోనేరు సాయికుమార్‌చ, సభ్యులు ప్రవీణ్, రమేశ్, చందన్‌రావు, రామ్మోహన్‌రావు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ర్యాంకర్‌కు..



నిజామాబాద్ నాగారం: నీట్ పీజీ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంకు, జాతీయ స్థాయిలో 558వ ర్యాంకు సాధించిన దీక్షితను శుక్రవారం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ ఘనంగా సన్మానించారు. ప్రణాళికాబద్ధమైన చదువు, క్రమశిక్షణ, సమయపాలనతో నీట్ పీజీ పరీక్షలో విజయాన్ని సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగమోహన్, డాక్టర్ జలగం తిరుపతి రావు, డాక్టర్ కిశోర్‌కుమార్, ఆఫీస్ సూపరింటెండెంట్ నాగరాజు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	1,14,800	వెండి(కిలో)	1,36,000
22 క్యారెట్స్	1,06,005		- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	40	80
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	30	60
బీరకాయ	50	100	దోసకాయ	25	50
దొండకాయ	40	80	ఆలుగడ్డ	20	40
జిర్నినుకాయ	50	100	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	80	గోబిపువ్వు	30	60
వంకాయ	30	60	బీట్‌రూట్	35	70
పాలకూర	50	100	కరివేపాకు	40	80
మెంతికూర	70	140	చామగడ్డ	30	60
కొత్తిమీర	50	100	చిక్కుడుకాయ	30	60
పుదీనా	50	100	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	50	100			

-సుభాష్‌నగర్

స్వదేశీ వస్తువులను వినియోగించాలి

- మేడిన్ ఇండియా లక్ష్యాలను సఫలీకృతం చేయాలి
- నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్ / నిజామాబాద్ లీగల్: ప్రజలు స్వదేశీ వస్తువులనే వాడాలని, మేడిన్ ఇండియా లక్ష్యాలను సఫలీకృతం చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం ఇందూరు వినియోగదారుల సంక్షేమ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన భారత స్వదేశీ వినియోగదారుల చైతన్య కార్యక్రమం, వస్తు వినియోగం ఆవశ్యకతకు సంబంధించిన పోస్టర్లను తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా స్వదేశీ వినియోగదారుల చైతన్య కార్యక్రమాలు ప్రారంభించడం హర్షణీయమని అన్నారు. దేశంలో పెట్టుబడిదారులు ఎవరైనా.. ఆయా వస్తువుల తయారీ వెనక మనమే ఉండాలని తెలిపారు. వినియోగదారుల సంఘాల ప్రతినిధులు స్వదేశీ ఉద్యమాన్ని పాఠశాలలు, కళాశాలల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, అనారోగ్యాలకు కారణమవుతున్న కూల్ డ్రింక్స్, పిజ్జా, బర్గర్ లాంటి జంక్ ఫుడ్స్ బహిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సమితి అధ్యక్ష, కార్యదర్శులు పెండోట అనిల్‌కుమార్, సందు ప్రవీణ్, క్యాట్ కో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాయవర్ రాజేశ్వర్, తంగళ్లపల్లి శ్రీనివాస్, వీఎస్ వర్మ, మహాదేవుని శ్రీనివాస్, గైని రత్నాకర్, దేవేశ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.



ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

ప్రధాని జీవిత చరిత్ర యువతకు ఎంతో స్ఫూర్తి

సుభాష్‌నగర్: ప్రధాని నరేంద్ర మోదీ జీవిత చరిత్ర యువతకు ఎంతో స్ఫూర్తినిచ్చేలా ఉందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. నగరంలోని పీవీఆర్‌లో ప్రధాని నరేంద్ర మోదీపై రూపొందించిన బయోపిక్ 'చలో జీతే హైన్'ను బీజేపీ కార్యకర్తలతో కలిసి అర్బన్ ఎమ్మెల్యే వీక్షించారు. నేటి రాజకీయ నాయకులు పార్టీలకు అతీతంగా మోదీని ఆదర్శంగా తీసుకుని సమాజం, దేశ శ్రేయస్సుకు కృషి చేయాలని ధన్‌పాల్ పిలుపునిచ్చారు. ఆయన వెంట నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, బంటు రాము, బుస్సాపూర్ శంకర్ తదితరులు ఉన్నారు.

మాణిక్ భవన్ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా

నిజామాబాద్ సిటీ: మాణిక్ భవన్ పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ప్రధాని జన్మదినం సందర్భంగా బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి శ్రీధర్ గుప్తా పాఠశాలకు చెందిన 800 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య పట్టణ సంఘం అధ్యక్షుడు ధన్‌పాల్ శ్రీనివాస్, మాణిక్ భవన్ పాఠశాల అధ్యక్షుడు ఇంగు శివప్రసాద్, నాయకులు ఇల్లందుల ప్రభాకర్, గాలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఊరికి దూరంగా.. నిరుపయోగంగా

- నిర్వహణ భారంగా మారిన రైతు వేదికలు
- సౌకర్యాలు లేక తప్పని ఇక్కట్లు



ధర్పల్లి రైతు వేదిక

ధర్పల్లి: రైతులకు అధునాతన వ్యవసాయ పద్ధతులు వివరించడం, వారంతా ఓ చోట సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా గత ప్రభుత్వ హయాంలో రూ. లక్షలు వెచ్చించి రైతు వేదికలను నిర్మించారు. ధర్పల్లి మండలంలో ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి రామడుగు, దుబ్బాక, ధర్పల్లి, హోన్నాజీపేటలో నాలుగు చోట్ల రైతు వేదికలను నిర్మించారు. వీటి నిర్మాణాలకు ఒక్కో దానికి రూ. 22 లక్షలు చొప్పున వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. ఇందులో కొన్ని గ్రామాలకు రైతు వేదికలు దూరంగా ఉండటంతో రైతులు అక్కడికి వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. రైతు వేదికల నిర్వహణకు ప్రతినెలా రూ.9 వేలను ప్రభుత్వం కేటాయించింది. ఈ మొత్తాన్ని తాగునీరు, విద్యుత్ బిల్లు, స్వీపర్, స్టేషనరీ ఇతర ఖర్చులకు ఉపయోగించాలి. ఇంతవరకు బాగానే ఉన్నా రెండేళ్లుగా రైతు వేదికల నిర్వహణ ఖర్చులకు నిధులు విడుదల కావడం లేదు. దీంతో ఏఈవోలు రైతు వేదికల నిర్వాణ బాధ్యతలను చూస్తున్నారు.

వసతులు అంతంత మాత్రమే..

రైతు వేదికలు చాలా చోట్ల గ్రామాలకు దూరంగా ఉన్నాయి. ప్రహరీ, భద్రత సిబ్బంది లేక పోవడంతో రైతు వేదికలోని సామగ్రిని ధ్వంసం చేయడం, ఎత్తుకెళ్లడం వంటివి జరిగాయి. చాలా రైతు వేదికల చుట్టూ పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల నీటి వసతి లేకపోవడంతో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణ అధ్వానంగా మారింది. ఎరువులు విత్తనాల పంపిణీ రైతు వేదికల్లో చేపట్టాలని నిర్ణయించినప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. ఇటీవల మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు రాష్ట్ర, జిల్లా అధికారుల సలహాలు, సూచనలు చేయడానికి ఎల్‌ఈడీ టీవీ, కంప్యూటర్, సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ప్రతి మంగళవారం రైతు నేస్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అధికారుల సమన్వయ లోపంతో ఈ కార్యక్రమాలకు రైతులు పెద్దగా రావడం లేదు. కొన్ని చోట్ల ఏఈవోలే తమ స్వంత డబ్బులతో రైతు వేదికల నిర్వహణ కోసం సిబ్బందిని నియమించుకుంటున్నారు. రైతు వేదికలకు నిర్వహణ ఖర్చులు విడుదల చేసి వాటిని వినియోగంలోకి తెచ్చేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు

నిజామాబాద్ నాగారం: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని కాకతీయ హైస్కూల్‌లో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆరోగ్య విద్యా బోధకుడు ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. జలుబు, విషజ్వరాలు, దగ్గు, నిమోనియా, టైఫాయిడ్, వాంతులు, నీళ్ల విరోచనాలు, ఫుడ్ పాయిజనింగ్, డెంగీ, మలేరియా,చికున్ గున్యా, మెదడువాపు లాంటి వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. నీటి నిల్వలను తొలగించాలని సూచించారు. ప్రతి రోజు వ్యాయామం, యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నటరాజ్, ఇన్‌చార్జి అనంత్, హెచ్‌ఈవో లింబారెడ్డి, ఆరోగ్య కార్యకర్త ఉష, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

మోపాల్: రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని బోర్గాం(పి) సొసైటీ వైస్ చైర్మన్ ఈగ జయకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం నగరశివారులోని బోర్గాం(పి) సొసైటీ సమావేశ మందిరంలో వైస్ చైర్మన్ జయకృష్ణారెడ్డి అధ్యక్షతన మహజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతాంగ సమస్యలపై పలువురు రైతులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి తల్లి నల్ల మంగమ్మ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. యాసంగిలో ధాన్యానికి బోనస్ రూ.500 ఇవ్వాలని, రూ. రెండు లక్షల రుణమాఫీ రాని రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని, సొసైటీకి రావాల్సిన ప్యాడీ కమీషన్ త్వరగా చెల్లించాలని తీర్మానం చేశారు. అలాగే రైతులు పంటను దళారులకు విక్రయించి మోసపోకుండా.. సొసైటీ కేంద్రంలో అమ్మి మద్దతు ధర పొందాలని తీర్మానించారు. సీఈవో కృష్ణ, డైరెక్టర్లు గంగాదాస్, మహేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఈగ సాయిరెడ్డి, సాయిబాబా, రైతులు, నాయకులు సూర్యారెడ్డి, ఎర్రన్న, చిట్టి సాయిరెడ్డి, నారాయణరెడ్డి, కంజర్ భూమయ్య, రాజారెడ్డి, చిట్టి పండరి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ చైర్మన్ జయకృష్ణారెడ్డి

పరిష్కార వేదికలను సద్వినియోగం చేసుకోవాలి

సుభాష్‌నగర్: విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్(సీజీఆర్‌ఎఫ్) ఎరుకల నారాయణ సూచించారు. శుక్రవారం నగరంలోని గంగస్థాన్ డీ-5 సెక్షన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ, మెంబర్లు రామకృష్ణ, కిషన్, నాలుగో మెంబర్ రాజాగౌడ్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కంఠేశ్వర్‌లోని న్యూహౌసింగ్ బోర్డులో విద్యుత్ తీగలు కిందికి వేలాడుతున్నాయని, వాటిని సరి చేయాలని ఫిర్యాదు వచ్చింది. వెంటనే ఆ తీగలను సరి చేయాలని ఎరుకల నారాయణ స్థానిక సిబ్బందికి ఆదేశించారు. డీఈ శ్రీనివాస్‌రావు, ఏడీఈ ప్రసాద్‌రెడ్డి, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎరుకల నారాయణ

కార్మికుల వేతన బకాయిలు ఇప్పించాలి

సుభాష్‌నగర్: జీపీ ఉద్యోగ కార్మికుల వేతన బకాయిలు వెంటనే ఇప్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దాసు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం నగరంలోని కలెక్టరేట్ ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డీపీవో కార్యాలయ ఏవో రాజాబాబుకు వినతిపత్రం అందజేశారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచే కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని అన్నారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు ప్రతిఏడాది రెండు జతల డ్రెస్సులు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి జేపీ గంగాధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంసన్, అబ్దుల్, గంగాధర్, సాయిలు, పోశెట్టి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బల్దియాను వెంటనే ప్రక్షాళన చేయాలి

నిజామాబాద్ సిటీ: నగర మున్సిపల్ అవినీతికి అడ్డాగా మారిందని, వెంటనే అవినీతికి ఆస్కారం లేకుండా ప్రక్షాళన చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి నీలం సాయిబాబా డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని కోటగల్లి ఎన్‌ఆర్ భవన్‌లో నిర్వహించిన నగర కమిటీ సమావేశంలో మాట్లాడారు. అధికారులు ప్రజల పనులు చేయడానికి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు రమేశ్, మోహన్, నర్సింగ్ రావు, గోపాల్, రాజు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ధర్పల్లి: మహిళా ఆరోగ్యంతోనే శక్తివంతమైన కుటుంబం సాధ్యమవుతుందని మెడికల్ ఆఫీసర్ సుకాంత్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో శుక్రవారం ఆరోగ్య మహిళా శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మహిళలకు, గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. 164 మందిని పరీక్షించగా అవసరం ఉన్నవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. శిబిరంలో వైద్యులు శివశంకర్, శృతి, మౌనిక, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సిరికొండలో..

సిరికొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 'స్వస్థ్ నారీ సశక్ పరివార్ అభియాన్'లో భాగంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి అరవింద్ శుక్రవారం తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మహిళల ఆరోగ్య అభ్యున్నతికి ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నెల 22న స్త్రీ వైద్య నిపుణులు, పిల్లలు, కంటి వైద్యులు, 25న సాధారణ వైద్య నిపుణులు, చర్మ వ్యాధి, కంటి వైద్యులు, 27న పిల్లల వైద్యులు, శస్త్ర చికిత్స, కంటి వైద్యులు, 30న చెవి, గొంతు, ముక్కు, చర్మ వ్యాధి, కంటి వైద్యులు, వచ్చే నెల 1న మానసిక వైద్య నిపుణులు, చర్మ వ్యాధి, ఎముకల వైద్యులచే ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

వలంటీర్లకు శిక్షణ



మోపాల్: మండలంలోని సిర్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఆదేశానుసారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లకు శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రాము మాట్లాడుతూ.. వయోజనులు అక్షరాస్యతతోపాటు కీలకమైన జీవన నైపుణ్యాలు నేర్చుకుంటారని తెలిపారు. సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా వలంటీర్లు పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనురాధ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్లాసికల్ డ్యాన్స్‌లో విద్యార్థిని ప్రతిభ



సిరికొండ: జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి నృత్య పోటీల్లో మండలంలోని రావుట్ల జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన వంగ ప్రణవి ప్రతిభ చాటినట్లు హెచ్‌ఎం చొప్పదండి శ్రీనివాస్ తెలిపారు. క్లాసికల్ డ్యాన్స్ సోలో విభాగంలో జిల్లా స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిందన్నారు. అనంతరం విద్యార్థినిని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఈవో అశోక్ ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఉపాధ్యాయులు రవి, గీత పాల్గొన్నారు.

కోతకు గురైన రోడ్లు

- ప్రమాదం అంచున ప్రయాణం
- మరమ్మతులు చేపట్టాలంటున్న ప్రజలు

ఇందల్వాయి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా ప్రధాన రోడ్లన్నీ కోతకు గురయ్యాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదం అంచున ప్రయాణాలు సాగిస్తున్నారు. ప్రధానంగా ఇందల్వాయి-ధర్పల్లి, గన్నారం-సిర్నాపల్లి, వెంగల్‌పాడ్-నల్లవెల్లి, ఇందల్వాయి- త్ర యంబక్‌పేట్, ఎల్లారెడ్డిపల్లె-లోలం గ్రామాల మధ్య రోడ్లు ప్రమాదకర రీతిలో కోతకు గురయ్యాయి.



ఇందల్వాయి-ధర్పల్లి మార్గంలో కోతకు గురైన రోడ్డు



కోతకు గురైన గన్నారం-సిర్నాపల్లి రోడ్డు

ప్రమాద సూచికల ఏర్పాటులో నిర్లక్ష్యం

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మరమ్మతులు సాధ్యపడకపోయినా రోడ్లు పాడైన చోట కనీసం ప్రమాద సూచికలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాహనదారులు విమర్శిస్తున్నారు. రాత్రి వేళల్లో గుంతలు, కోతలు స్పష్టంగా కనబడేలా రేడియం బారికేడ్లు పెట్టాల్సింది పోయి చెట్ల కొమ్మలు, బండరాళ్లు పెట్టడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అంటున్నారు.

సూచికలు ఏర్పాటు చేయాలి



రోడ్లు పాడైన చోట ప్రమాద తీవ్రతను తెలియజేస్తూ స్పష్టమైన సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. రాత్రి వేళల్లో గుంతలు, కోతలు కనబడటం లేదు. వర్షాలు తగ్గగానే వేగంగా రోడ్ల మరమ్మతులు చేపట్టాలి. ప్రమాదాలు జరగకముందే అధికారులు చర్యలు తీసుకోవాలి.

– బుచ్చిమల్లు, ఆటో యజమాని, నల్లవెల్లి

నివేదికలు పంపించాం

రోడ్లకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి పై అధికారులకు నివేదిక అందించాం. నిధులు రాగానే వేగంగా మరమ్మతులు చేపడతాం. అప్పటి వరకు ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉన్న చోట ప్రమాద సూచికలు ఏర్పాటు చేస్తాం. వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి.

-గంగాధర్, ఆర్అండ్‌బీ ఏఈ, ఇందల్వాయి

మాధవ్‌నగర్‌లో అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు

- ఇబ్బందుల్లో స్థానికులు
- పట్టించుకోని అధికారులు

నిజామాబాద్ రూరల్: నగరంలోని మాధవనగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వర్షాలు కురిసిన ప్రతిసారి రోడ్డుపైకి చేరుతుండడంతో దుర్గంధపు వాసన వస్తోంది. అంతేకాకుండా ఆ ప్రాంతంలో దోమలు విపరీతంగా ఉన్నాయని కాలనీవాసులు పేర్కొంటున్నారు. దీంతో స్థానికులు అనారోగ్యానికి గురై ఆస్పత్రులకు గురవుతున్నారు. మట్టితో ఉన్న డ్రెయినేజీలను పారిశుద్ధ్య కార్మికులు శుభ్రం చేయకపోవడంతో చెత్త పేరుకుపోతోంది. కనీసం చుట్టుపక్కల పెరిగిన పిచ్చి మొక్కలను సైతం తొలగించడం లేదు. సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు సంబంధిత అధికారులకు విన్నవించినా స్పందన కరువైంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



మాధవ్‌నగర్‌లోని డ్రెయినేజీలో పేరుకుపోయిన చెత్త

అధికారులు పట్టించుకోవడం లేదు

మాధవ్‌నగర్‌లో గత కొన్నేళ్లుగా మట్టితో కూడిన డ్రెయినేజీలే ఉన్నాయి. వాటిని శుభ్రం చేయించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో డ్రెయినేజీల్లో పేరుకుపోతున్న మురుగు, చెత్తతో దుర్వాసన వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించాలి.

– రేగొండ స్వామి, స్థానికుడు

కారుణ్య నియామకాలు చేపట్టాలి

నిజామాబాద్ సిటీ: జిల్లా పరిషత్‌లో విధినిర్వహణలో మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరుతూ జెడ్పీ ఉద్యోగులు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2023 ఆగస్టు నుంచి విధి నిర్వహణలో మృతిచెందినవారి పిల్లలకు అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లుగా నియమించారని, వారిని సూపర్‌న్యూమరిగా గుర్తించాలని కోరారు. శంకర్‌రాజు, నరేశ్ తదితరులు ఉన్నారు.



సంక్షిప్తం

మెరిట్ విద్యార్థికి నగదు ప్రోత్సాహం అందజేత



నిజామాబాద్ సిటీ: నగరంలోని ఖిల్లా ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కుమార్ సిద్ధి అనే విద్యార్థి చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు రూ.10 వేలు నగదు ప్రోత్సాహం అందించినట్లు పాటుకూరి ట్రస్టు బాధ్యుడు తిరుపతిరెడ్డి శుక్రవారం తెలిపారు. విద్యా ర్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'కళాకారుల ఆటపాట'ను జయప్రదం చేయండి

నిజామాబాద్ రూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కళాకారుల పాత్ర ఎంతో కీలకమని, వారి ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే కళాకారుల ఆట పాటను జయప్రదం చేయాలని తెలంగాణ నాట్య మండలి జేఏసీ నాయకుడు శుక్రవారం సిర్పలింగం కోరారు. నగరంలో పెన్షనర్ భవనంలో సాంస్కృతిక జేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కళాకారుల పాత్ర అనే అంశంపై నగరంలోని పెన్షనర్ భవన్‌లో ఆదివారం నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం కోరారు.

కళాకారులను ప్రోత్సహించాలి



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం చిత్ర కళాకారులను ప్రోత్సహించాలని కోనేరు సాయికుమార్ అన్నారు. జిల్లా కేంద్రానికి వచ్చిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌ను ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఆయన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 22న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జిల్లా కేంద్రానికి చెందిన బలవీర్ బాలకృష్ణకు బాపు చిత్రకళ ఉత్తమ జాతీయ అవార్డును బహూకరించనునట్లు పేర్కొన్నారు. చిత్ర కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

పుస్తకం ఆవిష్కరణ



నిజామాబాద్‌నాగారం: నగరంలోని వసంత్ నగర్, డాక్టర్స్ కాలనీలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత అధికారి ఘనశెట్టి రాములు, రచయిత పెంజర్ల గంగారాం రాసిన జీవిత చరిత్ర పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ నాంపెల్లి లక్ష్మణ్, వాకర్స్ సభ్యులు తానాజీ, కిషన్, గంగాధర్, రామారావు, నారాగౌడ్, ఎం.శేఖర్ గౌడ్, వాచ్‌మన్ గంగారాం, చామకూర శ్యామసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.